నమస్తే తెలంగాణ

సూర్యాపేట

5 | నల్లగొండ, ఆదివారం 18 ఫిబ్రవరి 2024 | SURYAPET

# రైతుబంధు జాడేది?

- యాసంగి సీజన్ ముగిసినా రైతులకు అందని పంట పెట్టుబడి సాయం
- ఉమ్మడి జిల్లాలో రూ.1450 కోట్లకు వచ్చింది రూ.493 కోట్లే..
- 10.56 లక్షల మంది రైతుల్లో 7.69 లక్షల మందికే రైతు బంధు
- ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటినా పట్టింపేది?
- ఇక రుణమాఫీ పరిస్థితి ఏంటో అంటున్న అన్నదాతలు



నల్లగొండ, ఫిబ్రవరి 17: యాసంగి సీజన్‌లో వేసిన పైరు పొట్ట దశకు వస్తున్నా అన్నదాతకు మాత్రం ప్రభుత్వం నుంచి పంట పెట్టుబడి సాయం అందడం లేదు. అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే రైతు బంధు వేస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కారు రెండు నెలలైనా పట్టించుకో కపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 10.56 లక్షల మంది రైతులకు ఈ సీజన్‌కు సంబంధించి రూ.1,450 కోట్లు పెట్టుబడి సాయం అందాల్సి ఉండగా, ఇప్పటివరకు రూ.493 కోట్లు మాత్రమే వారి ఖాతాల్లోకి చేరింది. నల్లగొండ జిల్లాలో 5,42,106 మంది రైతులకు గానూ 3,75,656 మందికి రూ.251.50 కోట్లు ఇచ్చింది. సూర్యాపేట జిల్లాలో 2,93,689 మంది రైతులు ఉండగా 2,12,204 మందికి రూ.130.08 కోట్లు, యాదాద్రిలో 2,21,113 మందికి గానూ 1,81,163 మందికి రూ.112.10 కోట్లు ఖాతాల్లో జమ చేసింది. ఇంకా రూ.956 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సాయం కోసం 2,87,885 మంది రైతులు ఎదురు చూస్తూనే ఉన్నారు. ఇప్పటివరకూ మూడెకరాల భూమి ఉన్న రైతులకు మాత్రమే రైతు బంధు అందింది. సీజన్ అదును దాటుతుండడంతో వడ్డీ వ్యాపారులు, బ్యాంకర్లను ఆశ్రయించి అప్పు తీసుకుని సాగు పనులు మొదలు పెట్టిన రైతులు ఇప్పటికీ సర్కారు సాయం అందకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### రెండున్నర నెలలైనా 34శాతమే..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా ఇప్పటివరకు రైతు బంధు 34 శాతమే ఇచ్చింది. రైతుకు పెట్టుబడి సాయం అందచేసి వ్యవసాయాన్ని లాభాసాటిగా మార్చాలనే ఆలోచనతో కేసీఆర్ సర్కారు ప్రారంభించిన రైతు బంధు లక్ష్యాన్ని దెబ్బతీస్తున్నది. డిసెంబర్ 9నే ఎకరాకు రూ.15వేల చొప్పున ఇస్తామని ప్రకటించిన కాంగ్రెస్ మాట మార్చి అదే పదివేల చొప్పున.. ఒక సీజన్‌కు రూ.5 వేల మాత్రమే ఇస్తూ, అదీ జాప్యం చేయడంపై రైతులు మండిపడుతున్నారు.

మరోవైపు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల రైతు రుణమాఫీ చేస్తామని చెప్పినా ఇప్పటి వరకూ దీనిపై అతీగతీ లేదు. ప్రభుత్వం కనీస ప్రకటన కూడా లేకపోవడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు.

### ఇప్పటివరకు రూ.251కోట్లు జమ



యాసంగి సీజన్‌కు సంబంధించిన రైతు బంధును ప్రభుత్వం గత డిసెంబర్ 10 నుంచి రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నది. నల్లగొండ జిల్లాలో 5,42,106 మంది రైతులకు రైతుబంధు రావాల్సి ఉండగా ఇప్పటివరకు 3,75,656 మంది రైతులకు రూ.251.50 కోట్లు అందాయి. మిగిలిన రైతులకు కూడా వేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది.

–శ్రవణ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్లగొండ

### కేసీఆర్ సర్కారు అయితే జనవరిలోనే వేసేది



యాసంగి పంట మొదలు పెట్టి రెండు నెలలు అయితున్నా ఇప్పటికీ ప్రభుత్వం రైతు బంధు పైసల్ ఖాతాలో పడలేదు. నాకు నాలుగెరాల భూమి ఉంది. వరి సాగు చేస్తున్నా. పెట్టుబడికి ఇబ్బంది అయితుంది. కేసీఆర్ ప్రభుత్వం యాసంగికి జనవరి మొదటి వారంలోనే పెట్టుబడి సాయం ఇచ్చేది. ఈ ప్రభుత్వంలో ఇప్పటికీ గతి లేదు.

–నారగోని యాదయ్య, రైతు, చిన్నసూరారం,నల్లగొండ మండలం

## డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పరీక్ష ఫలితాల్లో నకిరేకల్ వాసికి స్టేట్ సెకండ్ ర్యాంకు



చంద్రకళ

నకిరేకల్, ఫిబ్రవరి 17 : టీఎస్‌పీఎస్సీ శుక్రవారం విడుదల చేసిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రాత పరీక్ష ఫలితాల్లో నకిరేకల్ పట్టణానికి చెందిన పత్తేపురపు చంద్రకళ జోన్ మొదటి విభాగంలో స్టేట్ సెకండ్ ర్యాంకు సాధించింది. ఖమ్మం జిల్లాలో పుట్టిన ఆమె హైస్కూల్ విద్యను వైరాలో చదివింది. పాలమూరు యూనివర్సిటీలో బి.ఫార్మసీ, హైదరాబాద్‌లోని నైపర్ యూనివర్సిటీలో ఎం ఫార్మసీ పూర్తి చేశారు. ఆమెకు 2020 ఆగస్టులో నకిరేకల్ పట్టణానికి చెందిన వినయ్‌కుమార్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రెడ్డీ ల్యాబ్‌లో ఎనలైటికల్ సైంటిస్ట్‌గా ఆమె పనిచేస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించడంతో బంధువులు, స్నేహితులు, పట్టణవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నల్లగొండలో కేక్ కట్ చేస్తున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, చిత్రంలో జడ్పీచైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత అమిత్‌రెడ్డి



హాలియాలో రక్తదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

# సేవతో శుభాకాంక్షలు

ఘనంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి గులాబీ శ్రేణుల సంబురాలు
- పలుచోట్ల అన్నదానాలు, రక్తదానాలు, పండ్ల పంపిణీ
- నల్లగొండలో పాల్గొన్న మండలి చైర్మన్ గుత్తా, జడ్పీ చైర్మన్ బండ
- ఎక్కడికక్కడ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి17(నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 70వ పుట్టిన రోజు వేడుకలను ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. అభిమాన నేత పుట్టిన రోజు వేడుకను బీఆర్‌ఎస్ శ్రేణులతోపాటు అన్ని వర్గాల ప్రజలు సంబురంగా జరుపుకొన్నారు. సేవా కార్యక్రమాలతో గులాబీ దళపతికి శుభాకాంక్షలు తెలిపారు. ఎక్కడికక్కడ కేక్‌లు కట్ చేశారు. రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. వృద్ధులు, అనాథలు, ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. సర్వమత ప్రార్థనలు చేశారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా తోచిన సాయం చేశారు. నల్లగొండలో శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నివాసంలో జరిగిన వేడుకల్లో చైర్మన్ గుత్తాతోపాటు జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, గుత్తా అమిత్‌రెడ్డి పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గిఫ్ట్ స్మైల్ కార్యక్రమం పేరుతో గుత్తా అమిత్‌రెడ్డి నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌కు 80 వేల విలువైన ఐదు డోనర్ టేబుల్స్‌ను అందిస్తామని ప్రకటించారు. బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ బండతో కలిసి కేట్ కట్ చేశారు. దేవరకొండలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. హాలియాలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ శ్రేణులు తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి కట్ చేశాయి. హాలియాలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరంలో మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ రక్తదానం చేశారు. నకిరేకల్‌లో మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలో భారీ కేట్ కట్ చేసి వేడుకలు నిర్వహించగా.. పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మిర్యాలగూడలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ఆధ్వర్యంలో ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, రైతుబంధు మాజీ చైర్మన్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి భాస్కర్‌రావు కేక్ కట్ చేశారు. కోదాడలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయన కేక్ కట్ చేశారు. సూర్యాపేటలోని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నల్లగొండ పట్టణ అధ్యక్షుడు బోనగిరి దేవేందర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రిలో వీల్స్ ఆన్ మీల్స్ ప్రోగామ్‌లో భాగంగా 500 మంది రోగులకు అల్పాహారం అందజేశారు. టీఆర్‌ఎస్వీ నేత బొమ్మరబోయిన నాగార్జున ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు.



కోదాడ బీఆర్‌ఎస్ కార్యాలయంలో కార్యకర్తలకు కేక్ తినిపిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్



పార్వతి జడల రామలింగేశ్వర స్వామి కల్యాణ తంతులో భాగంగా భక్తులకు తాళి బొట్టు చూపుతున్న ప్రధానార్చకులు

# కల్యాణ వైభోగమే

రమణీయం.. పార్వతీ జడల రామలింగేశ్వరుడి కల్యాణోత్సవం

- భక్తజన సంద్రమైన చెర్వుగట్టు క్షేత్రం
- మార్మోగిన శివ నామస్మరణ
- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే వీరేశం దంపతులు
- కల్యాణాన్ని తిలకించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 17 : చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున స్వామివారి కల్యాణం అత్యంత వైభవోపేతంగా జరిగింది. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో చెర్వుగట్టు క్షేత్రం కిక్కిరిసింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. కల్యాణానికి రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. శివ నామస్మరణ, శివసత్తుల విన్యాసాలు, కోలాటాల నడుమ ఉత్తరాయణ పుణ్యకాలం మాఘ మాస శుద్ధ సప్తమి (రథసప్తమి) గడియలో కల్యాణ తంతు జరిపించారు. అంతకుముందు తెల్లవారుజామున 2 గంటల నుంచే సుప్రభాత సేవ మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అరుణ పారాయణం, అన్నాభిషేక మహానివేదనం నిర్వహించారు. ఉదయం 4:05 గంటలకు మేళతాళాలతో శివసత్తుల విన్యాసాల నడుమ స్వామివారిని నంది వాహనంపై, అమ్మవారిని గజ వాహనంపై కూర్చోబెట్టి ఎదుర్కోలు చేపట్టారు. అనంతరం కల్యాణ మండపం వద్ద విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, రక్షాసూత్రాధారణ నిర్వహించి 5:05 గంటలకు జీలకర్ర బెల్లం పెట్టించారు. అమ్మవారికి రక్షా సూత్రాధరణ చేశారు. జగత్ రక్షకుడైన పరమేశ్వరుడి గొప్పతనం వృత్తాంతాన్ని వివరించి మాంగళ్యం తంతుణానే లోకరక్షణా హేతునాం అంటూ యాజ్ఞీకులు మంత్రాలు పటిస్తుండగా 5 గంటల38 నిమిషాలకు త్రినేత్రుడు పార్వతీ అమ్మవారికి మాంగళ్యధారణ చేసే ఘట్టాన్ని భక్తులు తనివితీరా తిలకించారు. పరిణయ శోభతో మనోహరంగా దర్శనమిచ్చిన ఆది దంపతులకు తలంబ్రాలను సమర్పించుకున్న భక్తులతో కల్యాణ వేదిక కిక్కిరిసిపోయింది. దాదాపు 500 క్వింటాళ్ల పసుపు బియ్యాన్ని తలంబ్రాల రూపంలో అందించారు. యాజ్ఞీకులు అల్లవరపు సుబ్రమణ్యదీక్షితావధాని ఆచార్యత్వంలో ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో వేద పండితుడు నీలకంఠ శివాచార్యులు వ్యాఖ్యానం చేస్తుండగా రుత్వికుల వేద మంత్రాల మధ్య కల్యాణ తంతు జరిపించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా దేవాలయ అసిస్టెంట్ కమిషనర్ మహేంద్ర కుమార్, ఇన్‌చార్జి ఈఓ నవీన్, దేవాలయ సిబ్బంది వసతులు కల్పించారు. డీఎస్పీ శివరాంరెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. చెర్వుగట్టు రామలింగేశ్వరస్వామిని సినీ డైరెక్టర్ ఎన్.శంకర్ దంపతులు దర్శించుకున్నారు.



రామలింగేశ్వర స్వామికి పూజలు చేస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, పుష్ప దంపతులు



స్వామివారి కల్యాణోత్సవానికి తరలి వచ్చిన భక్తులు



### దేవాలయం అభివృద్ధికి కృషి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

చెర్వుగట్టు దేవస్థానం ప్రముఖ యాత్రా స్థలాల్లో ఒకటిగా వెలుగొందుతున్నందున దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. రాబోయే 3 నెలల్లో బ్రాహ్మణవెల్లెంల ఉదయ సముద్రం ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేస్తామని పేర్కొన్నారు. చెర్వుగట్టు దిగువకు రెండో ఘాట్ రోడ్డును ఏర్పాటు చేస్తామని చెప్పారు. దేవాలయ అభివృద్ధికి సహకరిస్తామని, మౌలిక వసతుల కల్పనకు కార్యాచరణ చేపడుతామని చెప్పారు.

### నేడు శేష వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెల్లవారుజామున శేష వాహనంపై స్వామివారి సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు రామలింగేశ్వర శర్మ తెలిపారు. సూర్య నమస్కారాలు, గవ్వంత అర్చనలు, దీక్షా హోమం, రుద్ర హోమం, బలిహరణం, వేదస్వస్తి, రుద్రాభిషేకం, నీరాజన మంత్ర పుష్పార్చన, ఆంజనేయ స్వామికి లక్ష తమలపాకులతో పూజ నిర్వహించనున్నట్లు చెప్పారు.



జ్యోతి ప్రజల్వన చేసి ప్రేరణ అవగాహన తరగతులను ప్రారంభిస్తున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే, డీసీపీ రాజేశ్ చంద్ర, నాగేశ్వర్‌రావు

## నెగెటివ్ ఆలోచనలు వద్దు.. థింక్ పాజిటివ్

- ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని శ్రద్ధగా చదువుకోవాలి
- కలెక్టర్ హనుమంతు కె.జెండగే
- మోత్కూరులో సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు ప్రేరణ తరగతులు

మోత్కూరు, ఫిబ్రవరి 17 : విద్యార్థులు నెగెటివ్ ఆలోచనా ధోరణిని పక్కన పెట్టి పాజిటివ్‌గా ఆలోచించాలని, ఉన్నత లక్ష్యాలను ఏర్పర్చుకుని శ్రద్ధగా చదువుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. శనివారం మోత్కూరులో ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నిర్వహించిన ప్రేరణ అవగాహన తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థులు చిన్న చిన్న సమస్యలను పెద్దగా ఊహించుకొని ఆందోళన చెందొద్దన్నారు. పాజిటివ్ ఎనర్జీని బయట పెడితేనే సక్సెస్ అవుతారని సూచించారు. ఒలింపిక్స్‌లో 28 గోల్డ్ మెడల్స్ సాధించిన అమెరికన్ స్విమ్మర్ మైఖేల్ ఫేల్ప్స్ తన ఏడు సంవత్సరాల వయస్సులోనే స్విమ్మింగ్ మొదలు పెట్టి తన గమ్య స్థానం చేరుకోవడం కోసం కష్టపడ్డాడని వివరించారు. చెయ్యికి గాయమైనా ప్రాక్టీస్ ఆపకుండా ముందుకు సాగి ప్రపంచ రికార్డులకు ఎక్కారని చెప్పారు. కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని, పరీక్షలు సమీపిస్తున్నందున బాగా చదువుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా లక్ష్య సాధనలో అనుసరించాల్సిన విషయాలపై ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు గంప నాగేశ్వర్‌రావు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డీఈఓ నారాయణరెడ్డి, ఎస్సీ, ఎస్సీ, బీసీ సంక్షేమాధికారులు జైపాల్‌రెడ్డి, యాదయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### క్రీడలపైనా ఆసక్తి పెంచుకోవాలి

విద్యార్థులు ఇంటర్నెట్‌ను విజ్ఞానం పెంచుకోవడానికి మాత్రమే ఉపయోగించుకోవాలి. చెడు అంశాలకు దూరంగా ఉండాలి. పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం ద్వారా విషయ పరిజ్ఞానం పెంచుకోవచ్చు. విద్యార్థులు క్రీడా రంగంలోనూ రాణించాలి. మంచి ఆరోగ్యం, ఏకాగ్రత, క్రమశిక్షణకు క్రీడలు దోహదపడుతాయి. నాయకత్వ, స్నేహపూర్వక లక్షణాలు అలవడుతాయి.

–రాజేశ్‌చంద్ర, డీసీపీ

## వైభవంగా అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట, ఫిబ్రవరి17 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అనుబంధ ఆలయంగా కొనసాగుతున్న పాతగుట్ట (పూర్వగిరి) లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో అధ్యనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉదయం స్వామివారి నిత్యారాధనల అనంతరం తిరుమంజన మహోత్సవం, సాయంత్రం పరమపద ఉత్సవం పాంచరాత్రాగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ప్రబంధ పాశురాలను పఠిస్తూ పురప్పాట్ సేవ నిర్వహించారు. స్వామివారి సేవను ఊరేగించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, డీఈఓ దోర్బాల భాస్కర్‌శర్మ, ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌థీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఏఈఓ గజవెల్లి రమేశ్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.మూడ్రోజులుగా పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరుగుతున్న అధ్యయనోత్సవాలు ఆదివారంతో పరిపూర్ణం కానున్నాయి.

### స్వామివారికి సుప్రభాత సేవ..

తెల్లవారుజామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అనంతరం స్వామి, అమ్మవార్లను దివ్య మనోహరంగా ముస్తాబు చేసి గజ వాహనంపై వేంచేపు చేసి వెలుపలి ప్రాకార మండపంలో ఊరేగించారు. స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సువర్ణ పుష్పార్చనలు జరిపించారు.

## ఫోర్జరీ కేసులో కాంగ్రెస్ నేత అరెస్ట్

- మాజీ ఉప సర్పంచ్ సంజీవ, ఏపూరి శివయ్యకు రిమాండ్
- మిగిలిన మూడు రసీదులపైనా విచారణ చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్
- అన్ని అక్రమ రిజిస్ట్రేషన్ల విచారణ జరుపాలని బీఆర్‌ఎస్ ధర్నా

సంస్థాన్ నారాయణపురం, ఫిబ్రవరి17: దొంగ ధ్రువీకరణ పత్రాలు, రబ్బర్ స్టాంపులు, ఫోర్జరీ సంతకాలతో అక్రమ రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించి అడ్డంగా దొరికిపోయిన సంస్థాన్‌నారాయణపురం కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ ఉప్పరగోని సంజీవను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రచురితమైన కాంగ్రెస్ నేత ఫోర్జరీ దందా కథనానికి స్పందించిన అధికారులు, పోలీసులు విచారణ చేపట్టి సంజీవ, అక్రమ రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నించిన ఏపూరి శివయ్యపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. వారిద్దరిని చౌటుప్పల్ కోర్టులో హాజరు పరిచి, అక్కడి నుండి నల్లగొండ జైలుకు తరలించినట్లు సంస్థాన్ నారాయణపురం ఎస్‌ఐ రాఘవేందర్ గౌడ్ తెలిపారు. గ్రామ పంచాయితీలో మాయమైన మూడు రసీదులపైనా విచారణ చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్ చేస్తున్నారు.

### బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన



సంస్థాన్ నారాణపురం మండల కేంద్రంలో ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సెక్రటరీ సంతకం ఫోర్జరీ చేసి, దొంగ రసీదులు సృష్టించి గ్రామ కంఠం భూమిని రిజిస్ట్రేషన్ చేయిస్తానని చెప్పి అమాయకులను డబ్బు వసూలు చేసిన మాజీ ఉప సర్పంచ్ సంజీవను శిక్షించాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కత్తుల లక్ష్మయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీలో పాలకవర్గం, అధికారులకు సంబంధం లేకుండా పదుల సంఖ్యలో అక్రమ రిజిస్ట్రేషన్లు జరిగాయని, వాటన్నింటిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.